క్లుప్తంగా

అధినేతను కలిసిన భరత్



కుప్పం: వైఎస్సార్‌ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్‌ సోమవారం విజయవాడలో కలిశారు. అసెంబ్లీ సమావేశం సందర్భంగా ఆయన్ను కలిసి స్థానిక రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

రైతులు విశిష్ట గుర్తింపు నంబర్‌ పొందాలి



కల్లూరులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి

పులిచెర్ల(కల్లూరు): భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నంబర్‌ తప్పక పొందాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ కోరారు. కల్లూరులోని రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుల విశిష్ట గుర్తింపు రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులందరూ విధిగా వారి వివరాలు సమర్పించి నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల రైతులు వ్యవసాయశాఖ పథకాల ఫలాలు పొందవచ్చని, రిజిస్ట్రేషన్‌ చేసుకోకపోతే ఏవీ పొందలేరన్నారు. మండలంలో మొత్తం 10,200మంది రైతులు ఉన్నారని ,ఇప్పటి వరకు నమోదు చేసినవారు 3650, పీఎం రైతు కిసాన్‌ 2450 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి హరి ప్రసాద్‌, వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్‌, దినేష్‌, రైతులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌ యాప్‌ల వలలో పడొద్దు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: తమ అవసరాల కోసం యువత బెట్టింగ్‌ యాప్‌ల్లో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటి వలలో పడరాదని సీఐ శ్రీనివాసులు హితవు పలికారు.సోమవారం స్థానిక బసవరాజ హైస్కూల్‌లో నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ అండ్‌ క్రైమ్‌ కంట్రోల్‌ ఫోర్స్‌ జిల్లా అధ్యక్షురాలు సల్మా , ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, యువత ఎక్కువగా బెట్టింగ్‌కు, మత్తుకు బానిసై జీవితాలను నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదువుకుని కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. మత్తు , బెట్టింగ్‌లపై సమాచారం అందిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధర, కో–ఆర్డినేటర్‌ రాజారెడ్డి, స్థానిక ప్రతినిధులు అన్సర్‌బాషా, జాఫర్‌బాషా, జబిబుల్లా, అనిల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

వంటసామగ్రి వితరణ



అన్నదానం కోసం వితరణగా ఇచ్చిన వంటసామగ్రి

కుప్పం రూరల్‌: మహాశివరాత్రిని పురస్కరించుకుని మల్లప్పకొండపై భక్తులకు అన్నదానం చేయడానికిగాను అవసరమైన వంట సామగ్రిని బీసీఎన్‌ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజు వితరణ చేశారు. సోమవారం రూ.70వేల విలువైన బియ్యం, పప్పు, నూనెలతో కలిసిన సామగ్రిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. బుధవారం మల్లప్ప కొండపైకి వచ్చే భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేయనున్నారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ డాక్టర్‌ సునీల్‌రాజ్‌, సీఈఓ సాగర్‌రాజ్‌, ప్రిన్సిపాల్‌ సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మంగళంపేటలో వీడ్కోలు సమావేశం

పులిచెర్ల(కల్లూరు): పదవ తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్‌ఎం ఫజురుల్లా అన్నారు. మంగళంపేట, పులిచెర్ల హైస్కూళ్లలో పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఉత్తీర్ణత సాధించి స్కూలు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ తాతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



బరిలో పరుగులు తీస్తున్న ఎద్దులు



మార్వాడలో జల్లికట్టును చూసేందుకు వచ్చిన జనం

కాసులు కురిపిస్తున్న జల్లికట్టు..!

- కూటమి నేతలకు ఆదాయ దాహం
- వేలల్లో ప్రవేశ రుసుం వసూలు
- లక్షలు ఆర్జిస్తున్న నిర్వాహకులు
- హద్దుల్లో నిలబడి ప్రాణాలు కోల్పోతున్న యువకులు
- పేరుకే ఆంక్షలు..ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుప్పంలో జల్లికట్టు (ఎద్దుల పండుగ)ను అధికార పార్టీ నాయకులు జేబులు నింపుకునే వనరుగా మార్చుకున్నారు. తమిళనాడు నుంచి కుప్పానికి పాకిన ఈ జల్లికట్టు సంస్కృతితో కూటమి నాయకులు అట్టే కష్టం లేకుండా లక్షలు ఆర్జిస్తున్నారు. జల్లికట్టుపై నిషేధం, ఆంక్షలు విధించామన్న అధికారులు ప్రకటనలకే పరిమితమై చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. మరోవైపు జల్లికట్టులో యువకులు ప్రాణాలు కోల్పోతున్నా, పలువురు గాయపడుతున్నా ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కుప్పం రూరల్‌: జల్లికట్టు అంటే సాధారణంగా జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భాల్లో నిర్వహిస్తుంటారు. కుప్పంలో మాత్రం ధనార్జన కోసం కూటమి నాయకులు ఏడాది పొడవునా నిర్వహిస్తున్నారు. దీంతో ఏటా నిర్వాహకుల సంఖ్య పెరుగుతోంది. అయితే, అధికారులు దీనిని కట్టడికి చర్యలు తీసుకోకపోవడం యువత ప్రాణాల మీదకు తెస్తోందనే చెప్పారు. ఆదివారం చోటుచేసుకున్న విషాద ఘటనే నిలువుటద్దం పడుతోంది. కుప్పం మండలం మల్లానూరులో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.1,25,001తో పాటు వెండి లక్ష్మీ దీపాలు, కుక్కర్లు..ఇలా మొత్తంగా 101 బహుమతులు ప్రకటించారు. ప్రవేశ రుసుం రూ.3500లుగా పెట్టారు. 400 ఎద్దుల వరకు వచ్చినట్లు స్థానికుల అంచనా. లెక్కన ఎంట్రీ ఫీజు రూపేణా నిర్వాహకులకు రూ.14 లక్షల వరకు వచ్చినట్లు అయింది. ఇందులో బహుమతులు, నిర్వహణ ఖర్చులకు రూ.7 లక్షలు వ్యయమైనా మరో రూ.7 లక్షలు మిగులుతోంది. ఇలా లక్షల్లో ఆదాయం వస్తుండడంతో గ్రామ గ్రామాన జల్లికట్టు నిర్వాహకులు ఎక్కువయ్యారు. సోమవారం సైతం కుప్పం మండలం మార్వాడ గ్రామంలో మొదటి బహుమతి రూ. 100116లుగా, ఎంట్రీ ఫీజు రూ.3000తో నిర్వహించారు. ఈ పండుగకు సైతం 300 ఎద్దులు వచ్చాయి. వీరు రూ.9 లక్షల వరకు పోగు చేశారు. ఇలా లక్షల్లో వస్తుండడంతో గ్రామ గ్రామానికి జల్లికట్టు జాఢ్యం విస్తరిస్తోంది.

ప్రాణాలు కోల్పోతున్న యువకులు



మృతి చెందిన కరుణాకరన్‌

జల్లికట్టులో సాధారణంగా యువకులు ఎద్దులను నిలువరించేందుకు నువ్వా, నేనా? అనే లెవెల్లో పోటీ పడుతూ ఉంటారు. ఈ ప్రయత్నంలోనే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రగాయాల పాలై వికలాంగులైన వారూ లేకపోలేదు. ఆదివారం నిర్వహించిన జల్లికట్టులో అడవిబూదుగూరుకు చెందిన కరుణాకరన్‌ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. పదుల సంఖ్యలో యువకులు గాయపడ్డారు. సోమవారం మార్వాడలో జరిగిన పండుగలోను పెద్ద ఎత్తున యువకులు గాయపడినట్లు స్థానికులు చెప్పారు. అంబులెన్స్‌ పలుమార్లు కుప్పం నుంచి మార్వాడకు వెళ్లడం గమనార్హం! ఇవేమీ పట్టని నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.



గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు

ప్రాణాలు పోతున్నా చర్యలు పూజ్యం

జల్లికట్టులో ఓ యువకుడు గాయపడి మరణించినా, పలువురు గాయపడి ఆస్పత్రి పాలైనా ఇప్పటి వరకు ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రకటనలతో సరిపుచ్చుతోంది. జల్లికట్టు చూసేందుకు వేలల్లో జనం వస్తుండడంతో భద్రతా చర్యలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటి కట్టడికి దృష్టి సారిస్తారా? ఒత్తిళ్లకు తలొగ్గి కూటమి నాయకులకు జీ హుజూర్‌ అంటారా? అనేది వేచిచూడాలి.



బహుమతుల వివరాలు ఉన్న కరపత్రం



ఎద్దులు పరుగులు తీసేందుకు వేసిన బరి



మార్వాడకు తిరుగుతున్న అంబులెన్స్‌

మంచి మార్కులతో ఉత్తీర్ణులుకండి



ఆదర్శ పాఠశాలలో సరస్వతి పూజ చేస్తున్న సరళ



టెన్త్‌ టాపర్‌కు బహుమతి అందజేస్తున్న సర్పంచ్‌

రొంపిచెర్ల: విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఎంఈఓ శ్రీనివాసులు ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్‌ విద్యార్థులు నిర్వహించిన సరస్వతి పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈఓ మాట్లాడారు. ఉర్దూ పాఠశాలలో 2023–24 సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 523 మార్కులు సాధించిన విద్యార్థిని హర్షియాకు సర్పంచ్‌ ఇబ్రహీంఖాన్‌ ప్రోత్సాహక బహుమతి కింద రూ.10వేలు అందజేశారు. ప్రతి ఏటా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి ఇస్తానని ఆయన చెప్పారు. ప్రిన్సిపాల్‌ సరళ, ఎస్‌ఓ సుజాత, హెచ్‌ఎం ప్రకాష్‌, టీచర్లు అక్బర్‌బాషా, ఫయాజ్‌, గంగాధర్‌, నసీమా, రసూల్‌ఖాన్‌, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా గురుకుల పాఠశాలలో..

రెండు స్కూళ్లలో ఘనంగా వార్షికోత్సవం





కస్తూర్బా గురుకుల పాఠశాలలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థినులు , బైరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్లో..

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూలు, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో సోమవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓం ఆకారంలో తీర్చిదిద్దిన ముత్యాలముగ్గుకు విద్యార్థినులు రంగులు వేసి కొవ్వొత్తులు వెలిగించారు. అలాగే సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఎంఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ, విద్యార్థులు పబ్లిక్‌ పరీక్షల్లో ఒత్తిడికి గురవకుండా బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

రండి బాబూ రండి..చికెన్‌, ఎగ్‌ వంటకాలు ఫ్రీ..!

–నేడు ఉదయం 10 నుంచి 2 గంటల వరకే బంపరాఫర్‌

పలమనేరు: బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని ఎంబీఎస్‌ కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు ఉచితంగా చికెన్‌ వంటకాలు, ఎగ్‌లను ఉచితంగా ఇవ్వనున్నట్టు చికెన్‌ వ్యాపారుల సంఘ నాయకులు రామచంద్ర నాయుడు సోమవారం తెలిపారు. చికెన్‌ తింటే ఏమి కాదని నిరూపించేందుకు వీహెచ్‌సీ, వీఎస్‌ఎన్‌, ప్రీమియం, బాలాజి తదితర కంపెనీ ప్రతినిధులు దీని నిర్వహణకు ముందుకొచ్చారని, దీనికి పోలీసుల అనుమతి సైతం పొందినట్టు చెప్పారు. చికెన్‌ ప్రియులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వయం ఉపాధి రుణాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్‌ భవాని, అధికారులు



బైరెడ్డిపల్లె: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు మేనేజర్లు

పెద్దపంజాణి: వివిధ కార్పొరేషన్లకు సంబంధించి స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ బాలాజి తెలిపారు. మండలానికి 80 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి కోసం 592 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఎస్బీజీబీ శంకర్రాయలపేట పరిధిలో 99 మంది, ఎస్‌బీఐ పుంగనూరుకు 76 మంది, ఐబీ కల్లుపల్లె బ్యాంకు పరిధిలోని 42 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు భవాని, పురుషోత్తం, తిరుమలయ్య, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: మున్సిపాలిటిలో బీసీ కార్పొరేషన్‌ రుణాలకు సోమవారం కమిషనర్‌ మధుసూదన్‌రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, కాపు కులాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం కార్పొరేషన్‌ రుణాలకు సంబంధించి 80 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హతల మేరకు బ్యాంకర్లతో కలసి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బైరెడ్డిపల్లె ఇండియన్‌బ్యాంక్‌, తీర్థం, కొలమాసనపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజి పాల్గొన్నారు.

27 నుంచి రుణాల ఇంటర్వ్యూలు

కుప్పం: వివిధ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు కుప్పం మండలంలో 27, 28 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయ్‌పత్‌ తెలిపారు. స్థానిక సచివాలయంలో 27న దాసేగానూరు, చందం, గరిక చీనేపల్లె, కొత్తపల్లె, అడవిబూదగూరు, చెక్కునత్తం, కొటాలూరు, కంగుంది, మహ్మద్‌పురం, దేవరాజుపురం, బ్రహ్మదేవర్చేను, గుడ్లనాయనిపల్లె, జరుగు, నూలుకుంట గ్రామాలకు, 28న శుక్రవారం క్రిష్ణదాసనపల్లె, పెద్దబంగారునత్తం, వెండుగంపల్లె, మల్లానూరు, టి.సదుమూరు, మోట్లచేను, గుట్టపల్లె, వానగుట్టపల్లె, మంకలదొడ్డి, నడుమూరు, వసనాడు, పైపాళ్యం, ఉర్లవోబనపల్లె తదితర పంచాయతీలకు అభ్యర్థులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వివరించారు.

భూసార పరీక్షలు సద్వినియోగం చేసుకోండి



భూసార పరీక్షలపై చెంగుబళ్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అప్పోజి

శాంతిపురం: ప్రధాన మంత్రి ప్రణామ్‌ భూసార పరిరక్షణ పథకం కింద నిర్వహించే ఉచిత భూసార పరీక్షలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. సోమవారం ఆయన చెంగుబళ్ల, కనుమలదొడ్డి, దండికుప్పం రైతు సమాచార కేంద్రాల పరిధిలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఒకసారి భూసార పరీక్ష చేయించుకుని రిపోర్టు పొందితే మూడేళ్ల వరకూ దానిని వినియోగించుకోవచ్చన్నారు. ఈ నెల 28లోపు రైతులు రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది బాలాజి, గోపి, వినయ్‌, గోవర్ధన్‌ పాల్గొన్నారు.

గుండె జబ్బులకు ప్రథమ చికిత్సపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చక్రారావు

గుడుపల్లె: గుండె జబ్బుకు అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎంతో ముఖ్యమని ఐఆర్‌సీఎఫ్‌ చైర్మన్‌ చక్రారావు అన్నారు. సోమవారం పీఈఎస్‌ మెడికల్‌ కాలేజీలో బీఎస్సీ ఇంటర్‌ నర్సింగ్‌ విద్యార్థులకు బీసీఎల్‌ఎస్‌ శిక్షణను ప్రారంభించి ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెకు సంబంధించిన ఇబ్బందులు, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులు కలిగినప్పుడు ప్రథమ చికిత్స చేసే విధానాన్ని బీసీఎల్‌ఎస్‌ అంటారన్నారు. నూతన అధునాతనమైన పద్ధతులను ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్‌ హెచ్‌ఆర్‌ కృష్ణారావు, మెడికల్‌ సూపరింటెండెంట్‌ సుబ్రమణి, ఏపీఎన్‌ఎంసీ రిజిస్ట్రార్‌ సుశీల, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ర్యాలీ, డాక్టర్‌ అభిరామి, అధ్యాపకులు, నర్సింగ్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన సదస్సు

పుంగనూరు: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్‌ సిద్ధార్థ, సిబ్బంది క్షయ, కుష్ఠు వ్యాధి లక్షణాలను వివరించి అవగాహన కల్పించారు. అనుమానిత లక్షణాలు కలిగిన వారు 9491311702కు సంప్రదించాలని కోరారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రాజశేఖర్‌, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


దోమల నిర్మూలనకు చర్యలు

సదుం: ప్రభుత్వ హాస్టళ్లలో దోమకాటుకు గురికాకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీషా కోరారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఎంజేపీ గురుకుల పాఠశాలలో సోమవారం మెలాథిన్‌ ద్రావణం పిచికారీ చేయించినట్లు ఆమె చెప్పారు. కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలని వార్డెన్లకు సూచించారు. మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి విద్యాసాగర్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ నీలకంఠ, సిబ్బంది రషీద్‌, శ్రావణి, సత్తాజ్‌, రేవతి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 519మంది హాజరు

పలమనేరు: స్థానిన మున్సిపల్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బీసీ, ఆర్య వైశ్య, కాపు సంక్షేమ సంఘాల రుణాల ఇంటర్వ్యూలకు 519మంది హాజరయ్యారని మున్సిపల్‌ కమిషనర్‌ రమణారెడ్డి తెలిపారు. వీరి సర్టిఫికెట్లు, అర్హతలను పరిశీలించి ఎంపికైన వారికి రుణాలు మంజూరు చేసినట్టు ఆయన చెప్పారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



పరీక్షల ప్యాడ్లను చూపుతున్న విద్యార్థినులు

గంగవరం: మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని దాతలు సోమవారం అందజేశారు. పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాతలు శ్రీపురం సీతారామయ్య, యల్లంపల్లె నరేంద్ర, తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు, పాఠశాల ఎస్‌ఓ రోహిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌ మేళాలో 236 మంది ఎంపిక



నియామక పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

వి.కోట: పట్టణంలోని శ్రీ విద్యానికేతన్‌, సీవీఆర్‌ఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌ మేళాలో 236 మంది అభ్యర్థులను వివిధ కంపెనీల ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ఆ సంస్థల కరస్పాండెంట్‌ దామోదర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 16 కంపెనీల ప్రతినిధులు హాజరై, 1044 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి ఈ ఎంపిక చేశారని చెప్పారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచి పలు కళాశాలల విద్యార్థులు జాబ్‌ మేళాకు హాజరయ్యారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రబోధానంద రచనలపై ప్రచారం చేస్తున్న సభ్యులు

కుప్పం రూరల్‌: పుస్తక పఠనంలో జ్ఞానం కలుగుతుందని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, తెలుగు పండుగలు..తదితర పుస్తకాలపై ఆది, సోమవారాల్లో శ్రీలంక కాలనీ, డీకే పల్లెలో ప్రచారం నిర్వహించారు. మహాశివరాత్రి విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో దేవరాజు, ప్రకాశ్‌, శరవణ, చందు, రాజ్‌కుమార్‌, పార్థసారధి, శివకృష్ణ, కృష్ణమూర్తి, వెంకటలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.